తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | గురువారం - 30- ఏప్రిల్ 2026 | సంపుటి : 3 | సంచిక : 332 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# మెట్రోను స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు ఎల్అండ్‌టీ సంస్థతో షేర్ల కొనుగోలు ప్రక్రియ పూర్తయింది. ఎల్ అండ్ టీ నుంచి రూ.1,461.47 కోట్లకు 100% షేర్లను స్వాధీనం చేసుకుంది, దీంతో ఫేజ్ I, ఫేజ్ II విస్తరణ, సేవల సమన్వయం మెరుగుపడనుంది. దీంతో ఇప్పుటి నుంచి మెట్రో నిర్వహణ బాధ్యత పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రానుంది. కాగా మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని ఇదివరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.



# తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌కు వేగం

- 150 మీటర్ల ఎత్తుపై సీఎం దిశానిర్దేశం
- ఉన్నతస్థాయి సమావేశంలో కీలక నిర్ణయాలు
- మహారాష్ట్రతో సంప్రదింపులకు ఆదేశాలు
- ప్రణహిత–చేవెళ్ల, మేడిగడ్డ పనులపై సమీక్ష





**హైదరాబాద్, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ వేమ నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో బ్యారేజ్ ఎత్తు, నీటి వినియోగ సామర్థ్యం వంటి అంశాలపై అధికారులు సమగ్ర ప్రదర్శన ఇచ్చారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే కనీసం 100 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చని నిపుణులు సూచించారు. ఇప్పటికే ప్రణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కోసం ఖర్చు చేసిన సుమారు 11 వేల కోట్ల రూపాయలు, నిర్మించిన కాల్వలను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. గత చర్చల ప్రకారం మహారాష్ట్ర 148 మీటర్ల ఎత్తుకు అంగీకరించగా, 152 మీటర్ల వద్ద ముంపు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మిగతా 2లో

# ప్రజా దర్బార్‌తో ప్రజల వద్దకే పాలన

- కూసుమంచి మండలం పాలేరులో అర్జీల స్వీకరణ
- సమస్యలకు గడువులో పరిష్కారం లక్ష్యం
- మే 4న మెగా జాబ్ మేళాకు పిలుపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2లో





## గ్రామ సమస్యల పరిష్కారానికి కమిటీలు

- కాంగ్రెస్ దిశానిర్దేశం
- హుస్నాబాద్‌లో కార్యకర్తల సమావేశం
- ధాన్యం కొనుగోలు, తాగునీరు వంటి అంశాలపై చర్చ
- పార్టీ బలోపేతంపై సూచనలు

**సిద్దిపేట, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

మిగతా 2లో

# సరస్వతీ అంత్య పుష్కరాలపై మంత్రులు సమీక్ష

- ఏర్పాట్లు వేగవంతం
- కాళేశ్వరంలో మే 21 నుంచి పుష్కరాలు
- కొండా సురేఖ, శ్రీధర్ బాబు సమీక్ష సమావేశం
- భక్తులకు పూర్తి సౌకర్యాలపై దృష్టి



**హైదరాబాద్, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో జరగనున్న సరస్వతీ అంత్య పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో పుష్కరాల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను అధికారులు వివరించారు. మే 21 నుంచి జూన్ 1 వరకు కాళేశ్వరంలో 12 రోజుల పాటు పుష్కరాలు నిర్వహించనున్న నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పుష్కరాల సందర్భంగా రూ.30.63 కోట్ల వ్యయంతో 162 అభివృద్ధి

మిగతా 2లో



# నిజామాబాద్‌లో పీసీసీ సమావేశం

- అభివృద్ధి, పార్టీ బలోపేతంపై చర్చలు
- కీలక నేతల సమక్షంలో విస్తృత సమావేశం
- సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలపై సమీక్ష
- జిల్లా అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలపై చర్చ

**నిజామాబాద్, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

నిజామాబాద్‌లో నిర్వహించిన పీఏసీ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఇంచార్జీ మంత్రి సీతక్కతో పాటు పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. ప్రభుత్వ సలహాదార్లు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, నగేష్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు సమావేశానికి హాజరయ్యారు.
ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతపై సమీక్ష నిర్వహించారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేకంగా చర్చించి, లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని

మిగతా 2లో



# ఇంధన సరఫరాపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ

- ప్రతి బంక్ తనిఖీ చేయాలి
- పెట్రోలు, డీజిల్ కొరతకు తావివ్వొద్దని ఆదేశాలు
- బాటిళ్లు, క్యాన్లలో విక్రయాలపై ఆంక్షలు
- క్యూలో ఉన్న వాహనదారులకు ప్రాధాన్యం

**జనగామ, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో పెట్రోలు, డీజిల్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు ఆదేశించారు. ఇంధన కొరతపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో

# ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిరక్షణకు కఠిన చర్యలు

- 10 రోజుల్లో ఖాళీ చేయాలని హైడ్రా ఆదేశాలు
- ఆక్రమణలపై హెచ్చరిక... నిర్మాణాలకు నో
- చెరువు అభివృద్ధికి ప్రణాళికలు

**హైదరాబాద్, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో జరుగుతున్న ఆక్రమణలను అరికట్టేందుకు హైడ్రా అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. చెరువు పరిధిలో తాత్కాలికంగా

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌కు వేగం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో మధ్యేమార్గంగా 150 మీటర్ల ఎత్తు సరైనదని సూచించారు. ఈ ప్రతిపాదనతో తక్కువ ఖర్చుతో ఎక్కువ నీటి వినియోగం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బ్యారేజ్ నిర్మాణం ద్వారా ఆదిలాబాద్‌తో పాటు మెట్ట ప్రాంతాల రైతులకు సాగు, తాగునీరు అందే అవకాశముందని సీఎం అన్నారు. అలాగే గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలించవచ్చని వివరించారు.

ప్రాజెక్ట్ ప్రాధాన్యత దృష్ట్యా మహారాష్ట్రతో వెంటనే సంప్రదింపులు జరపాలని సీఎం ఆదేశించారు. 150 మీటర్ల ఎత్తుతో పెద్దగా ముంపు సమస్య ఉండదని, ఎక్కడైనా ప్రభావం ఉంటే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సూచించారు. అవసరమైతే నేరుగా కలుసుకుని చర్చించాలని కూడా నిర్ణయించారు.

ఇక మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనులపై కూడా సమీక్ష నిర్వహించారు. జియో టెస్టింగ్ పనులను వేగంగా పూర్తి చేసి వానలకల్లా పనులు ముగించాలని అధికారులకు ఆదేశించారు. మొత్తానికి తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతున్నట్లు ఈ సమావేశం ద్వారా స్పష్టమైంది. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సీఎం తెలిపారు.



# గ్రామ సమస్యల పరిష్కారానికి కమిటీలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలకు పలు కీలక మార్గదర్శకాలు ఇచ్చారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ఆన్లైన్ విధానం సమర్థంగా అమలవుతుందో లేదో పర్యవేక్షించాలని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా వ్యవస్థను సక్రమంగా నడిపించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని చెప్పారు. అదేవిధంగా బడిబాట కార్యక్రమం, తాగునీటి సమస్యలు, ఆరోగ్య శిబిరాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కార్యకర్తలను ప్రోత్సహించారు.

వనమహోత్సవం కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పార్టీ బలోపేతం దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. ఓటరు జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండి ఎలాంటి లోపాలు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా పార్టీపై విశ్వాసం పెంచాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# ప్రజా దర్బార్‌తో ప్రజల వద్దకే పాలన

**ఖమ్మం, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో "ప్రజా దర్బార్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. కూసుమంచి క్లస్టర్ పరిధి నుంచి వచ్చిన ప్రజల సమస్యలను మంత్రి ప్రత్యక్షంగా విని, వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. న్యాయబద్ధమైన ప్రతి సమస్యకు ప్రణాళికబద్ధంగా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.



ప్రజాప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్న మంత్రి, 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ద్వారా అన్ని శాఖలకు సంబంధించిన సమస్యలను ఒకే వేదికపై పరిష్కరించే ప్రయత్నం జరుగుతోందన్నారు. మూడు నెలల వ్యవధిలో సమస్యలను పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మే 4న ఖమ్మంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

భూమి సంబంధిత సమస్యలపై స్పందిస్తూ, భూభారతి కార్యక్రమం ద్వారా పరిష్కారం చూపుతున్నామని మంత్రి తెలిపారు. సర్వే మ్యాప్‌తో కూడిన రిజిస్ట్రేషన్ విధానం అమలు అవుతుండటం సంతోషకరమని పేర్కొన్నారు. రానున్న నలభై రోజుల్లో సాదా బైనామాల సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. రైతుల విషయంలో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికపై పంటల కొనుగోళ్లు చేపడుతోందని తెలిపారు. మొక్కజొన్న, వరి పంటలకు ఈసారి మంచి దిగుబడులు వచ్చాయని, రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. రైతులకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.

ప్రతిపక్షాల విమర్శలపై స్పందిస్తూ, వాస్తవాలను పక్కనపెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంపై మంచి పేరు రావడం చూసి కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.

# ఇంధన సరఫరాపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎనర్జీ కమిటీ సమన్వయ సమావేశంలో పెట్రోలియం సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ సంస్థల్లో ఉన్న ఇంధన నిల్వల వివరాలను సేకరించారు.

ప్రతి పెట్రోల్ బంక్‌ను తహసీల్దార్, పోలీసులు, లీగల్ మెట్రాలజీ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. నిల్వలను పరిశీలిస్తూ సరఫరా సక్రమంగా కొనసాగుతోందో లేదో నిర్ధారించాలని ఆదేశించారు.

జిల్లాలో కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. బాటిళ్లు, క్యాన్లలో ఇంధనం పోయడం వల్ల సాధారణ వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. క్యూలో ఉన్న వాహనాలకు ప్రాధాన్యం ఇచ్చి ఇంధనం సరఫరా చేయాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతిరోజూ అవసరమైన మేర ఇంధనం అందుబాటులో ఉండేలా పెట్రోలియం సంస్థలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇండెంట్ ప్రకారం సరఫరా నిరంతరం కొనసాగాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోం, ఆర్డీవోలు గోపీరామ్, వెంకన్న, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, సివిల్ సప్లై అధికారి హతీరామ్, లీగల్ మెట్రాలజీ అధికారి ఝాన్సీ, వైద్య శాఖ అధికారి మల్లికార్జున రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఇంధన సరఫరా సజావుగా కొనసాగేందుకు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు.

# సరస్వతీ అంత్య పుష్కరాలపై మంత్రులు సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఘాట్ల నిర్మాణం, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్ వంటి వసతులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో పుష్కర స్నానం చేసి స్వామివారి దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టాలని మంత్రులు స్పష్టం చేశారు. భద్రత, రవాణా, వైద్య సేవలను సమర్థంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా పుష్కరాల అధికారిక పోస్టర్, టీజర్‌ను మంత్రులు ఆవిష్కరించారు. భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఉండాలని ఆదేశించారు. మొత్తానికి సరస్వతీ అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధమవుతోందని మంత్రులు తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన, భద్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయి.




# ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిరక్షణకు కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన షెడ్డుల్లో నివసిస్తున్న వారికి 10 రోజుల గడువు ఇస్తూ, వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, సహాయ పోలీసు అధికారి తిరుమల్, ఇరిగేషన్ శాఖ అధికారి రమాదేవి తదితరులు అక్కడికి చేరుకుని స్థానికులతో నేరుగా మాట్లాడారు. మీరు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నారని, ఇక్కడ నివాసాలు, దుకాణాలు కొనసాగించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.

చెరువును ఆక్రమించేందుకు కొంతమంది కబ్జాదారులు పేదలను ముందుంచుకుని కుట్రలు చేస్తున్నారని అధికారులు ఆరోపించారు. నిర్మాణ వ్యర్థాలు, మట్టిని పోసి చెరువు స్వరూపాన్ని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇంటింటికీ సేకరించిన చెత్తను ఇక్కడే వేరు చేసి చెరువులో పడేస్తుండటంతో నీటి వనరు కలుషితమవుతోందని పేర్కొన్నారు.

చెరువు అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా అందరూ సహకరించాలని హైడ్రా విజ్ఞప్తి చేసింది. గత ఆరు నెలలుగా హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఆక్రమణలు కొనసాగుతుండటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్ ఎం డీ ఏ లెక్కల ప్రకారం ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధి మొత్తం 52.20 ఎకరాలు. ఇందులో కొంతభూమిపై వివిధ వ్యక్తులు హక్కులు చేస్తున్నప్పటికీ, చెరువు పరిధిలో నిర్మాణాలు చేపట్టడం అనుమతించబోదని స్పష్టం చేశారు. బఫర్ జోన్‌తో కలిపి చెరువు విస్తీర్ణం మరింత పెరుగుతుందని తెలిపారు.

చెరువు చుట్టుపక్కల ప్రాంతాల్లో వేలాది మంది నివసిస్తున్న నేపథ్యంలో, ఈ నీటి వనరును పరిరక్షించడం అత్యవసరమని అధికారులు పేర్కొన్నారు. చెరువును మురికికూపంగా మార్చే చర్యలను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇక హైడ్రా చర్యలను స్థానికులు స్వాగతించారు. చెరువును కాపాడేందుకు ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నందుకు హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.

# నిజామాబాద్‌లో పీఏసీ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించారు. ప్రతి అర్హుడికి పథకాల లబ్ధి చేరేలా అధికారులు, నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజల నుంచి వస్తున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంపై కూడా సమావేశంలో దృష్టి సారించారు. స్థానిక సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు జారీ చేసినట్లు సమాచారం.




పార్టీ బలోపేతంపై కూడా నేతలు చర్చించారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను మరింత చైతన్యవంతం చేసి ప్రజల్లో పార్టీపై నమ్మకం పెంచాలని నిర్ణయించారు. ఈ సమావేశం ద్వారా జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పార్టీ బలోపేతం అనే మూడు ప్రధాన అంశాలపై స్పష్టమైన దిశానిర్దేశం లభించినట్లు తెలుస్తోంది.

# మంత్రి సీతక్కకు ఉత్తమ సేవా పురస్కారం

- ప్రజాసేవకు గుర్తింపుగా ఘన సత్కారం
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అవార్డు ప్రదానం
- గ్రామీణ అభివృద్ధి, మహిళలు, చిన్నారుల సంక్షేమానికి గౌరవం
- విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు... స్వీయ ప్రయాణం వివరించిన మంత్రి



**హైదరాబాద్, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** మంత్రి సీతక్క ప్రజాసేవలో అందించిన విశిష్ట కృషికి గుర్తింపుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాదాపూర్ శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈ ఘన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. వేలాది మంది విద్యార్థులు, ప్రముఖులు, అధికారులు హాజరైన ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళలు, చిన్నారుల సంక్షేమం, వెనుకబడిన వర్గాల సాధికారత కోసం మంత్రి సీతక్క చేసిన సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రజలతో మమేకమై, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించే నాయకురాలిగా ఆమెకు ఉన్న గుర్తింపు ఈ అవార్డుతో మరింత బలపడింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం తనకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఆయనకు ఉన్న అనుభవం, దేశ అభివృద్ధిపై ఆయన చూపిన దిశానిర్దేశం ఎంతో ప్రేరణనిచ్చేదిగా ఉంటుందని అన్నారు.

విద్యార్థులను ఉద్దేశించి మంత్రి సీతక్క ప్రేరణాత్మకంగా మాట్లాడారు. జీవితంలో సాధించాలంటే కష్టపడి చదవడం తప్పనిసరి అని, ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని దానికోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. విద్య మనిషి ఆత్మగౌరవాన్ని పెంచే శక్తి అని, దాన్ని ఎవరూ దోచుకోలేరని స్పష్టం చేశారు. తన వ్యక్తిగత జీవితాన్ని ఉదాహరణగా చెబుతూ, పదో తరగతి తర్వాత చదువు ఆపిన తాను తరువాత మళ్లీ చదువును కొనసాగించి ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజాసేవతో పాటు విద్యను కొనసాగించడం సాధ్యమేనని, సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు సందేశం ఇచ్చారు.

ములుగు జిల్లా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల క్రమశిక్షణ, జిల్లా యంత్రాంగం సమన్వయం, విద్యార్థుల కృషి కలిసి ఈ విజయాన్ని సాధించాయని వివరించారు. విజయాన్ని కొనసాగిస్తూ మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ప్రముఖ జర్నలిస్ట్ వెంకట్ నారాయణతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. మంత్రి సీతక్క సేవలను కొనియాడుతూ ఆమె ప్రజాసేవ పట్ల అంకితభావాన్ని ప్రశంసించారు. మొత్తానికి ప్రజల కోసం అంకితభావంతో పనిచేసే నాయకత్వానికి ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచింది. మంత్రి సీతక్క సేవలు భవిష్యత్తులో మరింత విస్తరించి సమాజానికి మేలు చేస్తాయని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# సింగరేణి ఉద్యోగులకు భారీ బీమా భద్రత

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేస్తూ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌తో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా బ్యాంకులో శాలరీ ఖాతాలు కలిగిన సింగరేణి ఉద్యోగులకు ప్రత్యేక బీమా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఒప్పందం ప్రకారం ఉద్యోగులకు ప్రమాద బీమా కింద ₹ 1.20 కోట్లు, సహజ మరణ బీమా కింద ₹ 10 లక్షల వరకు భద్రత లభించనుంది. ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు.

సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మార్గదర్శకత్వంలో డైరెక్టర్ గౌతమ్ పోట్రు ప్రత్యేక చొరవతో ఈ ఒప్పందం సాధ్యమైంది. ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా జీఎం కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల భద్రత, వారి కుటుంబాల సంక్షేమం సింగరేణి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలు ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. ఈ ఒప్పంద పత్రాలపై సింగరేణి, బ్యాంకు ప్రతినిధులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ అధికారులు, సింగరేణి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మొత్తానికి ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించే దిశగా సింగరేణి తీసుకున్న ఈ చర్య సానుకూల స్పందన పొందుతోంది. కార్మిక సంక్షేమంలో ఇది మరో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# బలిదుపల్లి మహిళా సంఘంలో అవినీతి ఆరోపణలు

**బుక్‌కీపర్‌పై విచారణ చేపట్టాలని వార్డ్ సభ్యుడు ఫిర్యాదు**



**అడ్డాకల్, ఏప్రిల్29(తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్నగర్ జిల్లా అడ్డాకుల మండలంలోని బలిదుపల్లి గ్రామ మహిళా సంఘంలో అవకతవకలు జరుగుతున్నాయంటూ గ్రామానికి చెందిన 5వ వార్డు సభ్యుడు ఆంజనేయులు అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. మహిళా సంఘంలో బుక్‌కీపర్‌గా పనిచేస్తున్న ముష్టి శ్రీధర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిధుల వినియోగంలో అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.ఈ మేరకు మహిళా సంఘం నిధులు, వరి కొనుగోలు వ్యవహారాలు, మహిళా సంఘం రుణాల పంపిణీ తదితర అంశాలపై సమాచారం కోరుతూ ఆంజనేయులు ఇటీవల ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తు చేశానని ఆంజనేయులు తెలిపారు.13-04-2026న మహబూబ్‌నగర్ జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయంలో సంబంధిత వివరాల కోసం అధికారులను ఆశ్రయించినట్లు తెలిపారు.ఆర్టీఐ దరఖాస్తును వెనక్కి తీసుకోవాలని బుక్‌కీపర్ ముష్టి శ్రీధర్ తనను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆంజనేయులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళా సంఘంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ ఘటనపై స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, సంబంధిత అధికారులు విచారణ చేపడతారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# హుజురాబాద్‌లో డంపింగ్ యార్డ్‌పై రాజకీయ తుపాన్

- సీఎం దిష్టిబొమ్మ దహనం, రాస్తారోకోలు.. ఆందోళనలు ఉద్ధృతం



**హుజురాబాద్, ఏప్రిల్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణ శివారులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ ఏర్పాటు వివాదం రోజురోజుకు రాజకీయ వేడిని పెంచుతోంది. డంపింగ్ యార్డ్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసనలు మరింత ఉధృతమయ్యాయి.

బీజేపీ నాయకులు గంట సంపత్ ఆధ్వర్యంలో బోర్నపల్లి 14, 24వ వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకుని ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ ఘటనతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఈ కార్యక్రమంలో కందుగుల గ్రామ సర్పంచ్ ముప్పు మహేష్ పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గంట సంపత్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే డంపింగ్ యార్డ్‌ను హుజురాబాద్ పరిధిలో ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆందోళనలో కుర్ర సంపత్, గంట కుమార్, గంట శ్రీనాథ్, సమ్మట సాయిరాం, మంచి కట్ల ప్రసాద్, ముక్క మధు, చింతల శ్రీకాంత్, ఆకోజు మధు, పరికల రాములు, జంగవంశీ రాము, ఇరుమళ్ల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ఇప్పల్ నర్సింగాపూర్‌లో హనుమాన్ ఆలయం సమీపంలో కూడా బీజేపీ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను తెలియజేశారు. డంపింగ్ యార్డ్ రద్దు ప్రకటన వచ్చే వరకు రాస్తారోకోలు, ధర్నాలు, నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా, హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్ష 38వ రోజుకు చేరుకోవడం గమనార్హం. ఈ దీక్షకు సంఘీభావంగా కొత్తపల్లి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకుని "డంపింగ్ యార్డ్ వద్దు - హుజురాబాద్ ముద్దు" అంటూ నినాదాలు చేశారు. ప్రజల మద్దతుతో ఈ ఉద్యమం మరింత విస్తరింపచేస్తామని చెప్పారు.

# సీఆర్‌పీలకు బదిలీలు చేపట్టాలి

- ప్రభుత్వాన్ని కోరిన యూనియన్ నేత నాగేశ్వరరావు



**దమ్మపేట, ఏప్రిల్ 29(తెలంగాణ ముచ్చట్లు):** సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న సీఆర్‌పీలకు బదిలీలు వెంటనే చేపట్టాలని సీఆర్‌పీ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పాద్య నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ, మే 1 నుంచి 31 వరకు బదిలీల ప్రక్రియ నిర్వహించాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, నాన్‌టీచింగ్ విభాగానికి చెందిన సీఆర్‌పీలను కూడా బదిలీల పరిధిలోకి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత 14 ఏళ్లుగా సీఆర్‌పీలకు బదిలీలు జరగకపోవడంతో భార్యాభర్తలు వేర్వేరు ప్రాంతాల్లో పనిచేయాల్సిన పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. కుటుంబ సభ్యుల నుండి దూరంగా ఉండటం వల్ల వృద్ధ తల్లిదండ్రులు, పిల్లల సంరక్షణ కష్టమవుతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వినతిపత్రాలు పలుమార్లు సమర్పించినప్పటికీ స్పందన రాలేదని, ఈసారి తప్పనిసరిగా బదిలీలు చేపట్టాలని సంఘం తరపున ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల ప్రతిభకు నిదర్శనం

- మద్దిగట్ల–మోజర్ల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో 100% ఫలితాలు





**పెద్దమందడి,ఏప్రిల్29(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్ల-మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి ఫలితాల్లో 100% శాతం ఉత్తీర్ణత సాధించి విజయ ఢంకా మోగించింది .ఈ విద్యాసంవత్సరంలో పరీక్షలకు హాజరైన 26 మంది విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించడం విశేషం.పాఠశాల విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించి ప్రతిభ కనబర్చారు. 500 మార్కులకు పైగా 5 మంది విద్యార్థులు, 400 మార్కులకు పైగా 16 మంది విద్యార్థులు, 350 మార్కులకు పైగా 5 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కుమారి దీప్తి 536 మార్కులతో తెలుగు మీడియం విభాగంలో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచి అందరి ప్రశంసలు అందుకుంది.ఈ ఫలితాలపై పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు సంతోషం వ్యక్తం చేశారు.విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం ముఖ్య కారణమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పి. వెంకటస్వామి, గద్వాల కృష్ణయ్య, శ్రీమతి వాణి ప్రభ, పుల్లయ్య, మధుసూదన్, ఎన్. వెంకటస్వామి, ఏ. వెంకటస్వామి, శ్రీనివాసులు, చిన్నారెడ్డి, కృష్ణవేణి అలాగే విశ్రాంత ఉపాధ్యాయులు డి. రణదీవ్, ఎ. భగవంతు విద్యార్థులను అభినందించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించడం, సాయంత్రం వేళల్లో అల్పాహారం అందించడం, ప్యానెల్ బోర్డుల ద్వారా వీడియో పాఠాలు బోధించడం వంటి చర్యలు ఈ విజయానికి దోహదపడ్డాయని ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు మరియు ఉపాధ్యాయులు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్య అందుతోందని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల అంకితభావం, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, డిజిటల్ బోధన విధానాలు విద్యార్థుల విజయానికి బలంగా నిలుస్తున్నాయని తెలిపారు.అదేవిధంగా గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలని ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

# సత్తుపల్లి వసతి గృహం విద్యార్థుల మెరుగైన ప్రతిభ

- వంద శాతం ఉత్తీర్ణత నమోదు.

**సత్తుపల్లి, ఏప్రిల్ 29(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి బాలుర వసతి గృహానికి చెందిన విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ప్రతిభ కనబరిచారు. మొత్తం 19 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై, అందరూ ఉత్తీర్ణత సాధించి వంద శాతం ఫలితాన్ని నమోదు చేశారు. విద్యార్థులలో 4 మంది 500కు పైగా మార్కులు సాధించగా, మరో 5 మంది 450కు పైగా మార్కులు సాధించడం గమనార్హం. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు కష్టపడి చదివితే ఎలాంటి ఫలితాలు సాధించవచ్చో ఈ విజయంతో మరోసారి రుజువైంది. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వసతి గృహ సంక్షేమ అధికారి ఎం. రమేష్ అభినందించారు. విద్యార్థుల కృషి ఫలితంగా ఈ విజయాన్ని సాధించారని పేర్కొంటూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.





# హుజురాబాద్‌లో అమరవీరుల స్మారక బ్యారక్ ప్రారంభం

- వీరుల త్యాగాలకు ఘన నివాళి

**హుజురాబాద్, ఏప్రిల్ 29(తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన అమరవీరుల స్మారక బ్యారక్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం బుధవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమం గంభీర వాతావరణంలో జరిగింది.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని తెలిపారు. వారి సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని, వారి త్యాగాల వల్లనే ప్రజలు నేడు ప్రశాంతంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. అమరవీరుల జ్ఞాపకార్థం ఈ స్మారక బ్యారక్ నిర్మాణం పోలీస్ శాఖకు గౌరవకరమైన విషయమని అన్నారు. సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడి, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించగలరని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమం దేశభక్తి వాతావరణంలో కొనసాగింది.

# పది ఫలితాలలో ముల్కనూర్ విద్యార్థి ప్రతిభ



**భీమదేవరపల్లి, ఏప్రిల్ 29(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో వెలువడిన పది ఫలితాలలో ముల్కనూర్ గ్రామానికి చెందిన జక్కుల. శివ గట్లనర్సింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ 561 మార్కులతో మండలంలో తృతీయ స్థానం లో నిలిచాడు. తల్లితండ్రి వ్యవసాయం ,కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు కుమారుడు మండలంలో అత్యధిక మార్కులు పొందడం వలన వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ అత్యధిక మార్కులు సాధించిన శివను గ్రామస్థులు అభిందిండం జరిగింది. మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వివాహ వేడుకకు హాజరుకావాలని ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

- గట్ల ఖానాపూర్ కాంగ్రెస్ యువ నాయకుడు ఎండి ఇమ్రాన్

**వనపర్తి,ఏప్రిల్29(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డిని గట్ల ఖానాపూర్‌కు చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు ఎండి ఇమ్రాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. మే 1వ తేదీన జరగనున్న తన తమ్ముడు వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎండి ఇమ్రాన్‌తో పాటు రాజేష్ పాల్గొన్నారు. ఆహ్వాన పత్రికను స్వీకరించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వివాహ వేడుక విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు.



# గోదావరి నది నిర్వహణ మండలి చైర్మన్ భేటీ ముఖ్యమంత్రితో చర్చలు

- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మర్యాదపూర్వక సమావేశం
- నీటిపారుదల అంశాలపై చర్చ
- ఇరిగేషన్ శాఖ అధికారుల హాజరు

**హైదరాబాద్, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** గోదావరి నది నిర్వహణ మండలి చైర్మన్ పి దోర్జే గ్యాంబా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగింది.

ఈ సందర్భంగా గోదావరి జలాల వినియోగం, నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం. రాష్ట్రానికి సంబంధించిన నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిపై కూడా ఇరువురు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ కార్యదర్శి ఈ శ్రీధర్ కూడా పాల్గొన్నారు. గోదావరి నది నీటి నిర్వహణలో సమన్వయం అవసరంపై అధికారులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం. నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. మొత్తానికి ఈ భేటీ గోదావరి నది నిర్వహణకు సంబంధించిన అంశాల్లో కీలకంగా మారనున్నట్లు అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రాల మధ్య సమన్వయం ద్వారా నీటి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు కొనసాగుతాయని తెలిపారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మార్క్ఫెడ్ ఆలస్యం...
# మక్కల కాపలాలో రైతులు

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**



మార్క్ఫెడ్ ద్వారా రైతుల వద్ద నుంచి మక్కల కొనుగోళ్లు జరుగుతున్నప్పటికీ, సకాలంలో తరలింపులు జరగక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని జమ్మికుంట మాజీ జెడ్పిటిసి డాక్టర్ శ్రీరాం శ్యామ్ పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

ప్రభుత్వం క్వింటాకు రూ.2400 చొప్పున మక్కలను కొనుగోలు చేస్తున్నప్పటికీ, కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాముల నుంచి సమయానికి దిగుమతి చేయకపోవడం వల్ల గోదాముల్లో మక్కల రాశులు పేరుకుపోతున్నాయని తెలిపారు. జమ్మికుంట, హుజురాబాద్ పట్టణాల్లో ఏర్పాటు చేసిన గోదాములు ఇప్పటికే నిండిపోతుండగా, రైతులు తమ పంటను నిల్వ ఉంచడానికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కరీంనగర్ జిల్లాతో పాటు హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన రైతుల మక్కలను కూడా ఇదే గోదాములకు కేటాయించడం వల్ల ఒత్తిడి మరింత పెరిగిందన్నారు.

మక్కల దిగుమతికి అధికారులు ఒకటి రెండు రోజులు ఆలస్యం చేయడం రైతులకు మరింత భారంగా మారుతోందని పేర్కొన్నారు. తక్షణమే స్పందించి గోదాముల నుంచి మక్కలను వేగంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అలాగే పెరుగుతున్న నిల్వలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని గోదాములు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను కోరారు.

# ముఖ్యమంత్రిని కలిసిన కొత్త డీజీపీ

- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమావేశం
- అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి
- భద్రతా వ్యవస్థపై చర్చ



**హైదరాబాద్, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర కొత్త డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ హైదరాబాద్‌లోని సమగ్ర కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సీవీ ఆనంద్‌కు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించినట్లు సమాచారం. పోలీసు వ్యవస్థ పనితీరు, భద్రతా ఏర్పాట్లు, ఆధునిక సాంకేతిక వినియోగంపై ఇరువురి మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ముఖ్యమంత్రి సూచించారు. సీవీ ఆనంద్ కూడా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ భేటీతో రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో కొత్త దిశలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల భద్రతను కాపాడే దిశగా సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.



# రైతు కొనుగోళ్లపై సీఎం కు
# హరీశ్ రావు బహిరంగ లేఖ

- కాంగ్రెస్ హామీలపై తీవ్ర విమర్శలు
- వరి, శనగ, జొన్న రైతుల సమస్యల ప్రస్తావన
- వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని, రైతు డిక్లరేషన్ పూర్తిగా అమలులో విఫలమైందని తీవ్ర విమర్శలు గుప్పించారు. పంటల కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం భారీగా చేరుతున్నప్పటికీ ఇంకా కొనుగోళ్లు ప్రారంభించకపోవడం ఏంటని ప్రశ్నించారు. మిల్లుల వద్ద బస్తాకు కిలో, రెండు కిలోల తరుగు తీస్తూ రైతులను నష్టపరుస్తున్నారని అన్నారు. ఎండల తీవ్రతలో రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పొద్దుతిరుగుడు రైతుల పరిస్థితి కూడా దారుణంగా ఉందని ఆయన పేర్కొన్నారు. గత ఇరవై రోజులుగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉన్నప్పటికీ సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కేంద్రం కొనుగోలు చేసిన పంట పరిమితంగానే ఉండగా, మిగిలిన లక్షకు పైగా క్వింటాళ్లను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. శనగ రైతుల సమస్యలపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతు ధర ఉన్నప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్మాల్సి వస్తోందని తెలిపారు. ఇది రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని అన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్మాల్సిన పరిస్థితి నివారించాలని కోరారు. అలాగే మొక్కజొన్న కొనుగోలు నిబంధనలను సడలించాలని సూచించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇల్లు.. కలల గడప దాటిన సంతోషం

- గృహ ప్రవేశంలో మున్సిపల్ చైర్మన్ పాల్గొన్నారు

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**





పేదల కలల్ని సాకారం చేసే ఇందిరమ్మ ఇళ్ల పథకం మరో కుటుంబంలో ఆనంద దీపాలు వెలిగించింది. జమ్మికుంట పట్టణ పరిధిలోని 16వ వార్డులో పల్లపు ఉమ-రమేష్ దంపతుల నూతన గృహ ప్రవేశం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది. కొత్త ఇంటి గడప దాటిన ఆ కుటుంబం ఆనందం అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఈ సంతోష క్షణాలను పంచుకునేందుకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ స్వయంగా హాజరై, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. "ఇల్లు అంటే కేవలం గోడలు కాదు... కుటుంబానికి భద్రత, గౌరవం, భవిష్యత్తుకు నమ్మకం" అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం ద్వారా పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఈ నస్రత్ పాషా, కోలుగురి కుమారస్వామి, జక్కె ప్రేమ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొని, కొత్త ఇంటి యజమానులకు అభినందనలు తెలిపారు. స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను మరింత ఉత్సాహంగా మార్చారు.

# ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం.. రైతుల ఆవేదన వ్యక్తం

- కొత్త నిబంధనలు రైతులకు భారంగా మారాయి – మిల్కూరి వాసుదేవ రెడ్డి

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్రంలో రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా సాగుతుండటంపై రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఐకెపి, ప్యాక్స్, డీసీఎంఎస్, హాకా సంస్థల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ, కొనుగోళ్లలో వేగం లేకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి విమర్శించారు.

బుధవారం జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో ఉన్న ఐకెపి వద్ద కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. కేంద్రాల్లో కనీస సౌకర్యాలే లేకపోవడం రైతుల సమస్యలను మరింత పెంచుతోందన్నారు. టార్పాలిన్లు ఇవ్వకపోవడం, నీడ కోసం టెంట్లు లేకపోవడం, తాగునీటి సౌకర్యం లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో తేమ పేరుతో కాటాలు వేయకపోవడం వల్ల రైతులు పక్షం రోజులుగా తమ ధాన్యాన్ని కాపలా కాస్తూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మబ్బులు కమ్ముకొస్తే ధాన్యాన్ని కుప్పలుగా వేసి మళ్లీ ఆరబెట్టాల్సి వస్తోందని చెప్పారు.

జిపిఎస్ ట్రాకింగ్, రియల్ టైం డాటా ఎంట్రీ వంటి కొత్త విధానాలు పారదర్శకత కోసం తీసుకొచ్చినా, ప్రస్తుతం రైతులకు భారంగా మారాయని విమర్శించారు. ఈ నిబంధనల కారణంగా కొనుగోళ్లు మరింత ఆలస్యమవుతున్నాయని అన్నారు.

ఇక లారీలు, ట్రాక్టర్లు, బొలెరో వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేయడానికి రూ.3000 నుండి రూ.5000 వరకు ఖర్చు అవుతుండటంతో వాహన యజమానులు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు.

జిల్లాలో సుమారు 100 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ, కేవలం 14 కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ రబీ సీజన్‌లో 3.70 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ఇప్పటివరకు కేవలం 10 వేల టన్నుల లోపే కొనుగోలు జరగడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా పాత విధానంలోనే కొనుగోళ్లు చేపట్టి, యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా కలెక్టరేట్, మంత్రి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శీలం అశోక్, కాయిత లింగారెడ్డి, రాజిరెడ్డి, కస్తూరి రవి, బండి ఓదెలు, వరికల రాజేశ్వరరావు, సింగవేన కుమారస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యరంగ సేవలకు గౌరవ వందనం.. మోహన్ రెడ్డి రిటైర్మెంట్ వేడుక

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**




జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విద్యా బోధకుడిగా సేవలందిస్తున్న అడిదెల మోహన్ రెడ్డి పదవీ విరమణ పొందనున్న సందర్భంగా ఆయనకు ఘనంగా సన్మాన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం జమ్మికుంట పట్టణంలోని బీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో వైభవంగా జరిగింది.

ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ మోహన్ రెడ్డిని శాలువా, స్మారక చిహ్నంతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మోహన్ రెడ్డి గత 35 సంవత్సరాలుగా వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. క్రమశిక్షణ, నిబద్ధత, నీతి, నిజాయితీకి ఆయన మారుపేరుగా నిలిచారని, ఇటువంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని పేర్కొన్నారు.

సేవా కాలం మొత్తం ప్రజల ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించారని, సహచరులకు మార్గనిర్దేశకుడిగా నిలిచారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రవణ్ కుమార్, పిఓ ఎంసిహెచ్ డాక్టర్ సనజవేరియా, వైద్యాధికారులు డాక్టర్ వరుణ, డాక్టర్ తులసీదాస్, డాక్టర్ చందన, డిప్యూటీ డెమో దుర్గారావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

- రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపాటు
- తెలంగాణ భవన్‌లో కల్వకుర్తి నేతల చేరిక
- ప్రజల బాధలపై ఆనందం అనడం దారుణం"
- రైతులు, విద్యార్థులు, అన్ని వర్గాల సమస్యలపై తీవ్ర విమర్శలు




**హైదరాబాద్, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలు పార్టీల కీలక నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా స్పందిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజలు ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే తనకు "పైశాచిక ఆనందం" కలుగుతుందని రేవంత్ రెడ్డి చెప్పడం అత్యంత బాధాకరమని కేటీఆర్ అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను చూసి బాధపడాల్సిన బాధ్యత ఉన్న ముఖ్యమంత్రి, ఆ బాధలనే ఆనందంగా భావించడం అనైతికమని విమర్శించారు. ప్రజల సమస్యలను ప్రతిపక్షాలు ప్రస్తావిస్తే, దాన్ని వ్యక్తిగతంగా తీసుకుని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.

రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని కేటీఆర్ ఆరోపించారు. గురుకుల విద్యాసంస్థల్లో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ, విద్యార్థుల మరణాలు జరిగినా ప్రభుత్వానికి కనీస స్పందన లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. విద్యార్థుల సమస్యలపై మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని ప్రస్తావించారు. బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కోర్టు తీర్పుల కారణంగా విద్యార్థులపై అదనపు భారాలు పడుతున్నా ప్రభుత్వం ముందడుగు వేయడం లేదని విమర్శించారు. దీనివల్ల పేద విద్యార్థుల చదువు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంటల కొనుగోళ్లు దాదాపు పూర్తిగా నిలిచిపోయాయని, ధాన్యం, మొక్కజొన్న, జొన్నల కొనుగోలు కేంద్రాలు సక్రమంగా ప్రారంభించలేదని ఆరోపించారు. రైతులు తెచ్చిన ధాన్యం రోడ్లపై వర్షాలకు తడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు కేటాయించడంలో కూడా ఆలస్యం జరుగుతోందని, బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే కారణంతో కొనుగోళ్లు ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. రైతుబంధు నిధులు సమయానికి జమ కావడం లేదని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉన్నాయని కూడా విమర్శించారు.

ప్రభుత్వంపై విమర్శలు చేస్తే వాటిని స్వీకరించి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉండగా, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం ద్వారా తప్పించుకోవడం సరైంది కాదని కేటీఆర్ పేర్కొన్నారు. "నేను మారిన మనిషిని" అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి, మాటల్లో మాత్రం మార్పు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు.

ప్రజల బాధలను అర్థం చేసుకోకుండా వ్యాఖ్యలు చేయడం ఒక ముఖ్యమంత్రికి తగదని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలే తగిన నిర్ణయం తీసుకుంటారని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో వాటికి తగిన సమాధానం ఇస్తారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంతో బీఆర్ఎస్‌లో చేరికలు కొనసాగుతున్నాయని, క్షేత్రస్థాయిలో పార్టీ బలం పెరుగుతోందని నాయకులు పేర్కొన్నారు. రాబోయే రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్ మరింత బలంగా నిలుస్తుందని పార్టీ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.




# ఢిల్లీ హైకోర్టు వర్చువల్ విచారణలో కలకలం

- వాదనలు జరుగుతుండగానే అభ్యంతరకర వీడియో
- రెండుసార్లు అంతరాయం... కోర్టు ఆందోళన
- సైబర్ దాడి అనుమానాలతో విచారణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఢిల్లీ హైకోర్టులో వర్చువల్ విచారణ సందర్భంగా ఊహించని ఘటన చోటుచేసుకుని న్యాయవర్గాల్లో కలకలం రేపింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు వినిపిస్తుండగానే అకస్మాత్తుగా అభ్యంతరకర వీడియో ప్రదర్శితమవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. చీఫ్ జస్టిస్ సమక్షంలోనే ఈ ఘటన జరగడం పరిస్థితి తీవ్రతను మరింత పెంచింది. వర్చువల్ హియరింగ్ కొనసాగుతున్న సమయంలో మధ్యలో అనూహ్యంగా అశ్లీల వీడియో ప్రదర్శితమవడంతో న్యాయమూర్తులు వెంటనే స్పందించారు. ఒక్కసారి కాదు, రెండు సార్లు ఇదే సమస్య తలెత్తడంతో కోర్టు వాతావరణం అసహజంగా మారింది. వెంటనే విచారణను నిలిపివేసి, పరిస్థితిని సమీక్షించే చర్యలు చేపట్టారు.
మొదటిసారి సమస్య తలెత్తిన వెంటనే వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థను రీస్టార్ట్ చేశారు. కొద్దిసేపు వ్యవస్థ సాధారణంగా పనిచేసినా, మళ్లీ అదే ఘటన పునరావృతం కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తదుపరి జాగ్రత్త చర్యగా మొత్తం వ్యవస్థను పూర్తిగా నిలిపివేసి విచారణను నిలిపివేశారు. ఇదిలా ఉండగా వీడియో ప్రదర్శితమవుతున్న సమయంలో "మీ వ్యవస్థలో చొరబాటు జరిగింది" అనే హెచ్చరిక సందేశం కూడా కనిపించినట్లు సమాచారం. అంతేకాకుండా స్వయంచాలక ధ్వని ద్వారా కూడా చొరబాటుకు సంబంధించిన హెచ్చరికలు వినిపించడంతో ఈ ఘటనపై అనుమానాలు మరింత పెరిగాయి. దీంతో సైబర్ దాడి జరిగి ఉండొచ్చనే చర్చలు ప్రారంభమయ్యాయి.
ఈ ఘటనలో ఎవరో వ్యక్తి స్క్రీన్ భాగస్వామ్యం ద్వారా అనధికారికంగా వీడియోలను ప్రదర్శించి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీధర్ సర్ణాబాత్, శిత్జీత్ సింగ్ ఖాతాల ద్వారా ఈ వీడియోలు ప్రదర్శించబడ్డాయని అధికారులు భావిస్తున్నారు. దీనిపై సాంకేతిక నిపుణులు విచారణ ప్రారంభించారు. వర్చువల్ కోర్టు వ్యవస్థల భద్రతపై ఈ ఘటన కీలక ప్రశ్నలు లేవనెత్తింది. డిజిటల్ వేదికల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# బిష్కెక్‌లో రక్షణ మంత్రివర్గ సమావేశాలు

- సహకార బలోపేతం
- కిర్గిజ్, కజాక్, బెలారస్ మంత్రులతో ద్వైపాక్షిక చర్చలు
- పశ్చిమ ఆసియా పరిస్థితులపై చైనా, రష్యా మంత్రులతో సమీక్ష
- ఆరోగ్య సహాయక పరికరాల బహుమతి

**బిష్కెక్, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కిర్గిజిస్తాన్ రాజధాని బిష్కెక్‌లో పలు దేశాల రక్షణ మంత్రులతో కీలక సమావేశాలు నిర్వహించారు. కిర్గిజ్, కజాక్, బెలారస్ దేశాల మంత్రులతో ద్వైపాక్షిక చర్చలు జరిపి రక్షణ రంగంలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించారు. ఈ సమావేశాల్లో భద్రతా సహకారం, శిక్షణ, సాంకేతిక మార్పిడి వంటి అంశాలు ప్రాధాన్యం పొందినట్లు సమాచారం. ప్రాంతీయ స్థిరత్వం, భద్రతకు సంబంధించి ఉమ్మడి వ్యూహాలపై కూడా చర్చలు సాగినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా పశ్చిమ ఆసియా పరిస్థితుల నేపథ్యంలో చైనా, రష్యా రక్షణ మంత్రులతో కూడా రాజ్‌నాథ్ సింగ్ చర్చలు జరిపారు. అంతర్జాతీయ భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సమన్వయం అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.
మానవతా దృక్కోణంలో భాగంగా కిర్గిజిస్తాన్‌కు రెండు 'భీష్మ ఆరోగ్య మైత్రి హెల్త్ క్యూబ్'లను బహుమతిగా అందజేశారు. విపత్తుల సమయంలో సహాయక చర్యలు, శోధన కార్యక్రమాల్లో ఇవి ఉపయోగపడనున్నాయి. ఈ చర్యల ద్వారా భారత్ అంతర్జాతీయ వేదికలపై తన భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రక్షణ రంగంలో సహకారం పెంపుతో పాటు మానవతా సహాయానికి కూడా భారత్ ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం అవుతోంది. బిష్కెక్‌లో జరిగిన ఈ సమావేశాలు ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా పరంగా కీలకంగా మారాయని అధికారులు పేర్కొన్నారు.

# వాతావరణ అవగాహనకు 'క్రావిస్' వేదిక




- కేంద్ర మంత్రి ప్రారంభం
- సాక్ష్యాధార నిర్ణయాలకు కొత్త సాధనం
- గ్రీన్ టెక్నాలజీతో అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్య
- వికసిత భారత్ లక్ష్యానికి దోహదం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** వాతావరణ మార్పులపై సాక్ష్యాధార నిర్ణయాలను తీసుకునేందుకు ఉపయోగపడే 'క్రావిస్' అనే ఆధునిక వాతావరణ అవగాహన వేదికను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. వాతావరణ మేధస్సు ఆధారంగా సహనశక్తిని పెంపొందించే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఈ వేదికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, భారతదేశం వాతావరణ చర్యలను ఆర్థిక అవకాశాలుగా మలుచుకుంటోందని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పునరుత్పాదక శక్తి, గ్రీన్ ఆవిష్కరణలు, శుభ్రమైన సాంకేతికతల ద్వారా దేశ అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకున్నాయని తెలిపారు. గ్రీన్ పరిశ్రమలు ఉద్యోగాలను సృష్టించడంతో పాటు దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడుతున్నాయని ఆయన అన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో భారత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. స్టార్టప్‌లు, ఆవిష్కర్తలు, కొత్త సాంకేతికతల బలం దేశానికి ఉన్న గొప్ప ఆస్తి అని మంత్రి పేర్కొన్నారు. ఈ వేదిక ద్వారా డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని, భవిష్యత్తులో సమర్థవంతమైన ప్రణాళికలకు దోహదం చేస్తుందని వివరించారు. 'క్రావిస్' వేదిక దేశాన్ని డిజిటల్ ఆధారిత భవిష్యత్తు వైపు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో ఈ వేదిక సహకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కొంటూనే అభివృద్ధి సాధ్యమని భారత్ నిరూపిస్తోందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

# దౌత్య రంగంలో భారత్ దూసుకెళ్తోంది: జైశంకర్

- మిషన్ల అధిపతుల సదస్సులో ప్రసంగం
- ప్రపంచంతో భారత సంబంధాల విస్తరణపై ప్రస్తావన
- జాతీయ ప్రయోజనాల సాధనకు సిద్ధమని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ న్యూఢిల్లీలో నిర్వహించిన మిషన్ల అధిపతుల 11వ సదస్సులో భారత హైకమిషనర్లు, రాయబారులు, విదేశాంగ శాఖ ఉన్నతాధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. గత దశాబ్దంలో ప్రపంచంతో భారత్ సంబంధాలు గణనీయంగా విస్తరించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితుల్లో భారత దౌత్య విధానం మరింత చురుకుదనంతో ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. వివిధ దేశాలతో సహకారం పెంచుకుంటూ, భారత ప్రయోజనాలను రక్షించే దిశగా దౌత్య వ్యవస్థ పని చేస్తోందని తెలిపారు.




ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, ఉద్రిక్తతల మధ్య కొనసాగుతున్నప్పటికీ, భారత్ తన దౌత్య సామర్థ్యంతో జాతీయ లక్ష్యాలను సాధించేందుకు సిద్ధంగా ఉందని జైశంకర్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ పాత్ర మరింత బలపడుతోందని అన్నారు. భారత విదేశాంగ విధానం దేశ అభివృద్ధి, భద్రతకు అనుగుణంగా రూపుదిద్దుకుంటోందని, ప్రపంచంలో భారత్ స్థానం మరింత పటిష్టమవుతోందని వివరించారు. దౌత్య రంగంలో వచ్చిన ఈ మార్పులు దేశానికి కొత్త అవకాశాలను తెస్తాయని అభిప్రాయపడ్డారు.
ఈ సదస్సు ద్వారా విదేశాల్లో పనిచేస్తున్న భారత ప్రతినిధులతో సమన్వయం పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ వ్యూహాలపై చర్చలు జరిగాయని అధికారులు తెలిపారు. ప్రపంచ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని దౌత్య చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. మొత్తానికి, మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో భారత దౌత్యం జాతీయ ప్రయోజనాల సాధనకు మరింత దృఢంగా ముందుకు సాగుతోందని ఈ సదస్సు స్పష్టం చేసింది.

# ఇరాన్ రాయబార కార్యాలయం పోస్టుపై వివాదం

- ఆత్మబలిదాన పిలుపుపై తీవ్ర విమర్శలు
- యూకే ప్రభుత్వ ఆగ్రహం... రాయబారికి సమన్లు
- పోస్టును సమర్థించుకున్న ఇరాన్

**లండన్, ఏప్రిల్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** యునైటెడ్ కింగ్డమ్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం చేసిన ఒక సామాజిక మాధ్యమ పోస్టు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. యూకేలో నివసిస్తున్న ఇరానీయులను ఉద్దేశించి దేశం కోసం ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉండాలని చేసిన పిలుపు వివాదానికి దారితీసింది. ఆ పోస్టులో అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో శత్రువులకు తలొంచవద్దని, అవసరమైతే దేశం కోసం ప్రాణాలను అర్పించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా, అలాంటి వారంతా తమను సంప్రదించాలని కోరడం మరింత వివాదాస్పదమైంది.
ఈ పోస్టుపై వివిధ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రజలను రెచ్చగొట్టేలా, ఆందోళన కలిగించేలా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విదేశాల్లో నివసిస్తున్న పౌరులకు ఇలాంటి పిలుపులు ఇవ్వడం సరైంది కాదని వ్యాఖ్యలు వినిపించాయి. ఈ పరిణామంపై యూకే ప్రభుత్వం కూడా తీవ్రంగా స్పందించింది. ఇరాన్ రాయబారి సయ్యద్ అలీ మౌసావినికి సమన్లు జారీ చేసి వివరణ కోరింది. ఇలాంటి పోస్టులు దౌత్య పరంగా అనుచితమని అధికార వర్గాలు పేర్కొన్నాయి.
అయితే ఈ విమర్శలను ఇరాన్ రాయబార కార్యాలయం ఖండించింది. తమ పోస్టు దేశభక్తి, విధేయతకు సంబంధించినదని, హింసను ప్రోత్సహించే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరానీయులు తమ మాతృభూమి రక్షణలో ముందుంటారని తెలిపింది. ఇటీవల ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కూడా దేశ రక్షణ కోసం అవసరమైతే ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉండాలని పౌరులకు పిలుపునిచ్చిన విషయం ప్రస్తావనలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ పోస్టు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసింది.



గురువారం - 30 - ఏప్రిల్ 2026

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రపంచ వేదికపై భారత్ గర్జన



ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలనే డిమాండ్ మరోసారి ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి రాయబారి పి. హరీష్, భద్రతా మండలి సంస్కరణలపై జరుగుతున్న అంతర ప్రభుత్వ చర్చల్లో కీలక ప్రసంగం చేశారు. కేవలం సభ్యత్వ విస్తరణ మాత్రమే కాకుండా, వీటో అధికారంతో కూడిన శాశ్వత సభ్యత్వమే నిజమైన సంస్కరణ అని భారత్ స్పష్టం చేసింది. ప్రస్తుత వ్యవస్థ 80 ఏళ్ల నాటి కాలం చెల్లిన పద్ధతులతో నడుస్తోందని, ఇది నేటి భౌగోళిక రాజకీయ వాస్తవాలను ప్రతిబింబించడం లేదని భారత్ ఘాటుగా విమర్శించింది. శాశ్వత సభ్యత్వం విషయంలో వస్తున్న ప్రతిష్టంభనను తొలగించేందుకు భారత్ ఒక వ్యూహాత్మక వెసులుబాటును ప్రకటించింది. జి4 కూటమి (భారత్, బ్రెజిల్, జర్మనీ, జపాన్) చేసిన ప్రతిపాదనకు భారత్ మద్దతు తెలిపింది. దీని ప్రకారం, కొత్తగా చేరే శాశ్వత సభ్య దేశాలకు మొదటి 15 ఏళ్ల వరకు వీటో అధికారాన్ని వాయిదా వేయవచ్చు. ఆ తర్వాత సమీక్ష నిర్వహించి తుది నిర్ణయం తీసుకోవాలని భారత్ సూచించింది. చర్చల్లో పురోగతి కోసం ఈ స్థాయిలో మొగ్గు చూపడం భారత్ యొక్క చిత్తశుద్ధిని చాటిచెబుతోంది. అయితే, వీటో అధికారం లేని రెండో స్థాయి శాశ్వత సభ్యత్వాన్ని మాత్రం భారత్ నిర్ద్వంద్వంగా వ్యతిరేకించింది.

ప్రస్తుత భద్రతా మండలిలో ఐదు శాశ్వత సభ్య దేశాల పెత్తనం కొనసాగుతోంది. చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, అమెరికాలు మాత్రమే వీటో అధికారాన్ని కలిగి ఉన్నాయి. 1965లో జరిగిన ఏకైక సంస్కరణలో కేవలం తాత్కాలిక సభ్య దేశాల సంఖ్యను మాత్రమే పెంచారని, దీనివల్ల శాశ్వత సభ్యుల బలం మరింత పెరిగిందని భారత్ గుర్తు చేసింది. ఆఫ్రికా, గ్లోబల్ సౌత్ దేశాలకు సరైన ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల మండలి నిర్ణయాలకు చట్టబద్ధత కరువవుతోందని భారత్ వాదించింది. ప్రపంచ జనాభాలో మెజారిటీ వాటా ఉన్న దేశాలకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లేకపోవడం అన్యాయమని పేర్కొంది. భారత్ చేస్తున్న ఈ పోరాటానికి అంతర్జాతీయ స్థాయిలో మద్దతు పెరుగుతోంది. యూకే, ఫ్రాన్స్ వంటి దేశాలు భారత్‌కు బహిరంగంగా మద్దతు తెలుపుతుండగా, చైనా వంటి దేశాలు మాత్రం కొన్ని షరతులతో అడ్డుకుంటున్నాయి. మరోవైపు, 'యునైటింగ్ ఫర్ కన్సెన్సస్' (కాఫీ క్లబ్) పేరుతో పాకిస్థాన్, ఇటలీ వంటి దేశాలు శాశ్వత సభ్యత్వ విస్తరణను వ్యతిరేకిస్తున్నాయి. ఇటువంటి అడ్డంకులను అధిగమించేందుకు భారత్ తన దౌత్యపరమైన ఒత్తిడిని పెంచుతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా భారత్‌కు ఈ పదవి దక్కడం చారిత్రక అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి మనుగడ సాగించాలంటే కాలంతో పాటు మారక తప్పదని భారత్ హెచ్చరించింది. భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టకపోతే, అంతర్జాతీయ శాంతి భద్రతను కాపాడటంలో ఈ సంస్థ విఫలమయ్యే ప్రమాదం ఉందని భారత్ అభిప్రాయపడింది. రాబోయే సాధారణ అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై మరింత లోతైన చర్చలు జరిగే అవకాశం ఉంది. భారత్ పట్టుబట్టినట్లుగా వీటో అధికారంతో కూడిన శాశ్వత పీఠం దక్కితే, ప్రపంచ రాజకీయాల్లో భారత్ ఒక తిరుగులేని శక్తిగా అవతరిస్తుంది. ఈ లక్ష్య సాధన కోసం భారత్ తన గళాన్ని మరింత బలంగా వినిపిస్తోంది.

# వైభవ్‌ను ఆపడం కష్టం: గావస్కర్



ఐపీఎల్ 2026లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత ఫామ్‌తో అదరగొడుతున్నాడు. అతడి బ్యాటింగ్‌పై టీమిండియా మాజీ దిగ్గజం సునీల్ గావస్కర్ ప్రశంసల వర్షం కురిపించారు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ కేవలం 16 బంతుల్లోనే 43 పరుగులు చేసి జట్టుకు దూకుడు ఆరంభం ఇచ్చాడు. ఈ సీజన్‌లో ఇప్పటికే 400 పరుగులు చేసి లీడింగ్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. వైభవ్ ఆటతీరుపై స్పందించిన గావస్కర్, "అతడు ఆడుతున్న షాట్లు అద్భుతం. పది మంది ఫీల్డర్లను బౌండరీ వద్ద పెట్టినా అతడిని ఆపడం కష్టం. వయస్సే అతడి బలం. ప్రత్యర్థి ఎవరనేది పట్టించుకోకుండా నిర్భయంగా ఆడుతున్నాడు" అని వ్యాఖ్యానించారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఇలాంటి ప్రదర్శన చేయడం అరుదైన విషయమని గావస్కర్ అభిప్రాయపడ్డారు. భయం లేకుండా ఆడే ధైర్యమే అతడిని ప్రత్యేకంగా నిలబెడుతోందని తెలిపారు. గత సీజన్‌లోనే ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన వైభవ్, తక్కువ మ్యాచ్‌ల్లోనే శతకం నమోదు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ సీజన్‌లో కూడా అదే జోరు కొనసాగిస్తూ జట్టుకు కీలకంగా మారాడు. ఇక రాజస్థాన్ రాయల్స్ ఈ సీజన్‌లో మంచి ప్రదర్శన చేస్తూ పాయింట్ల పట్టికలో అగ్రస్థానాల కోసం పోటీపడుతోంది. వైభవ్ ఫామ్ కొనసాగితే జట్టుకు మరిన్ని విజయాలు ఖాయం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# నిజాయితీతోనే ఉజ్వల భవిష్యత్తు






ప్రస్తుత సమాజంలో నైతిక విలువలు, యథార్థత యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పడానికి ఈ రోజును ప్రత్యేకంగా జరుపుకోవడం ఒక మంచి పరిణామం. మనిషి జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా, చిత్తశుద్ధి లేని పక్షంలో ఆ విజయాలకు విలువ ఉండదు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఎంతవరకు యథార్థంగా ఉంటున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం ఒక గుణం మాత్రమే కాదు, ఒక వ్యక్తి యొక్క సంస్కారాన్ని, పారదర్శకతను ప్రతిబింబించే అద్దంలాంటిది. యథార్థంగా ఉండటం వల్ల లభించే అతిపెద్ద ప్రయోజనం మానసిక ప్రశాంతత. అసత్యాలు చెప్పి తప్పించుకోవాలని చూసే వ్యక్తి ఎప్పుడూ ఒక రకమైన ఆందోళనకు గురవుతుంటాడు. నిజాన్ని ధైర్యంగా చెప్పే వ్యక్తికి ఎటువంటి భయం ఉండదు. ఇది ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, ఎదుటివారి దృష్టిలో మన పట్ల గౌరవాన్ని రెట్టింపు చేస్తుంది. కార్యాలయాల్లో, వ్యాపారాల్లో నిబద్ధతతో వ్యవహరించే వారికే దీర్ఘకాలంలో మంచి గుర్తింపు, అవకాశాలు లభిస్తాయి. నమ్మకం అనేది సంపాదించుకోవడానికి ఏళ్ల సమయం పట్టినా, ఒక్క చిన్న పొరపాటుతో అది క్షణాల్లో కుప్పకూలిపోయే ప్రమాదం ఉంది.

కుటుంబ వ్యవస్థలో కూడా ఈ విలువలు కీలక పాత్ర పోషిస్తాయి. పెద్దలు తమ పిల్లలకు చిన్నతనం నుండే యథార్థంగా ఉండటం వల్ల కలిగే గొప్పతనాన్ని వివరించాలి. పొరపాటు జరిగినప్పుడు భయపడి దాచడం కంటే, దానిని ఒప్పుకొని సరిదిద్దుకోవడం ఉత్తమమని నేర్పించాలి. దీనివల్ల పిల్లల్లో బాధ్యతాయుతమైన ప్రవర్తన పెరుగుతుంది. ఒకరిపై ఒకరికి నమ్మకం ఉన్న కుటుంబాల్లో బంధాలు ఎంతో బలంగా ఉంటాయి. సమాజంలోని ప్రతి వ్యక్తి దీనిని ఒక ఆభరణంలా భావించినప్పుడే అవినీతి రహితమైన, పారదర్శకమైన వ్యవస్థ నిర్మాణం సాధ్యమవుతుంది.

సామాజిక దృక్పథంతో ఆలోచిస్తే, నిబద్ధత గల వ్యక్తులు ఉన్న దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వ యంత్రాంగంలో, ప్రజా జీవితంలో స్పష్టత ఉన్నప్పుడే పథకాలు అర్హులైన వారికి చేరుతాయి. నేటి యువత ఈ లక్షణాన్ని అలవర్చుకోవడం వల్ల వారు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదిగే అవకాశం ఉంటుంది. చరిత్రలో నిలిచిపోయిన గొప్ప నాయకులందరూ తమ జీవితాల్లో యథార్థతను ఒక సూత్రంగా పాటించిన వారే. వారిని స్ఫూర్తిగా తీసుకొని మనం కూడా అదే మార్గంలో పయనించడం వల్ల సమాజంలో గొప్ప మార్పును తీసుకురావచ్చు.

విద్యా సంస్థలలో నైతిక విద్యకు పెద్దపీట వేయాలి. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించాలి. విద్యార్థి దశలోనే విలువలకు పునాది పడితే, వారు సమాజంలో ఎదురయ్యే ప్రలోభాలకు లొంగకుండా ఉంటారు. ఉపాధ్యాయులు తమ ప్రవర్తన ద్వారా విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి. ఒక ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం ఉండాలంటే ప్రతి ఒక్కరూ నియమాలకు కట్టుబడి ఉండటం ఎంతో ముఖ్యం. దీనివల్ల ప్రతిభావంతులకు సరైన గుర్తింపు లభిస్తుంది, సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుంది.

వ్యాపార రంగంలో పారదర్శకత అనేది వినియోగదారుల నమ్మకాన్ని గెలుచుకోవడానికి ప్రధాన మార్గం. నాణ్యత విషయంలో రాజీ పడకుండా, సరైన ధరలకు వస్తువులను అందించడం వల్ల సంస్థల కీర్తి పెరుగుతుంది. మోసపూరిత ప్రకటనలకు దూరంగా ఉంటూ, వినియోగదారులకు వాస్తవాలను తెలియజేయాలి. ఇది కేవలం లాభాల కోసమే కాకుండా, సామాజిక బాధ్యతగా భావించాలి. దీర్ఘకాలిక వ్యాపార సంబంధాలు కేవలం నమ్మకం మీదనే ఆధారపడి ఉంటాయి. అందుకే ప్రతి లావాదేవీలోనూ స్పష్టత ఉండటం చాలా అవసరం. నేటి డిజిటల్ యుగంలో సమాచారం వేగంగా వ్యాపిస్తోంది. ఈ క్రమంలో వాస్తవాలను ధ్రువీకరించుకోవడం మరింత ముఖ్యం. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేయకుండా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. మనం పంచుకునే ప్రతి విషయం యథార్థమై ఉండాలి. దీనివల్ల అనవసరమైన గందరగోళం తగ్గడమే కాకుండా, సమాజంలో శాంతి నెలకొంటుంది. ప్రతి ఒక్కరూ ఒక సమాచార యోధులుగా మారి, వాస్తవాలను మాత్రమే ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఇది దేశాభివృద్ధికి, సామాజిక సామరస్యానికి ఎంతో దోహదపడుతుంది. యథార్థంగా బతకడం ఒక గొప్ప సాహసంతో కూడుకున్న పని అయినా, అది ఇచ్చే తృప్తి అమోఘం. ఈ ప్రత్యేక సందర్భంలో మనమందరం ఒక ప్రతిజ్ఞ చేద్దాం. కష్టకాలంలోనైనా, సుఖాల్లోనైనా సత్యాన్నే వరించాలని, ఇతరులతో పారదర్శకంగా ఉండాలని నిర్ణయించుకుందాం. సమాజంలో మార్పు మన నుండే మొదలవ్వాలి, ఆ మార్పుకు ఈ విలువలనే పునాది కావాలి. ప్రతి చిన్న విషయంలోనూ స్పష్టంగా ఉండటం అలవాటు చేసుకుంటే, అది మనల్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది. నమ్మకమే ఊపిరిగా, చిత్తశుద్ధే బాటగా సాగిపోదాం.

# మూగజీవాలకు నీడను ఇద్దాం




## అడాప్ట్ ఏ షెల్టర్ పెట్ డే

సమాజంలో అనాథలుగా మిగిలిపోయిన జంతువులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వీధుల్లో తిరుగుతూ సరైన ఆహారం, ఆశ్రయం లేక అలమటించే మూగజీవాలను చేరదీయడం ఒక గొప్ప సామాజిక మార్పుకు నాంది పలుకుతుంది. ఈ ప్రత్యేకమైన రోజున జంతువులను కొనుగోలు చేయడం కంటే, సంరక్షణ కేంద్రాల్లో ఉన్న వాటిని దత్తత తీసుకోవడం ద్వారా వాటికి కొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చు. ప్రతి జీవికి సురక్షితమైన వాతావరణంలో పెరిగే హక్కు ఉంటుంది. మన ఇంట్లో ఒక సభ్యునిగా వాటిని ఆహ్వానించడం వల్ల మనకూ మానసిక ఉల్లాసం లభిస్తుంది. జంతువులను దత్తత తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. సంరక్షణ కేంద్రాల్లో ఉండే జంతువులు తరచుగా ఒంటరితనంతో బాధపడుతుంటాయి. మనం వాటిని దత్తత తీసుకున్నప్పుడు, అవి మన పట్ల ఎనలేని విశ్వాసాన్ని ప్రదర్శిస్తాయి. జంతు ప్రదర్శనశాలలు లేదా విక్రయ కేంద్రాల నుండి ఖరీదైన వాటిని తెచ్చుకోవడం కంటే, ఆశ్రయం కోసం ఎదురుచూసే వాటిని చేరదీయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడిన తృప్తి కలుగుతుంది. ఇది కేవలం దయతో చేసే పని మాత్రమే కాదు, సమాజంలో జంతు సంక్షేమం పట్ల ఉన్న అవగాహనను పెంచుతుంది.

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని తగ్గించుకోవడానికి పెంపుడు జంతువులు ఎంతగానో తోడ్పడతాయి. ఇంటికి రాగానే మనల్ని ప్రేమగా పలకరించే ఆ మూగజీవాలు ఇచ్చే సంతోషం వెలకట్టలేనిది. పిల్లల్లో జంతువుల పట్ల ప్రేమను పెంచడం వల్ల వారిలో చిన్నతనం నుండే బాధ్యతాయుతమైన ప్రవర్తన అలవడుతుంది. పెంపుడు జంతువుల సంరక్షణ అనేది ఒక క్రమశిక్షణతో కూడిన ప్రక్రియ. వాటికి సమయానికి ఆహారం ఇవ్వడం, ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా మనం కూడా క్రియాశీలకంగా మారతాము. చాలామంది జంతువులను దత్తత తీసుకోవడానికి వెనుకాడుతుంటారు. దీనికి ప్రధాన కారణం వాటి నిర్వహణపై సరైన అవగాహన లేకపోవడం. సంరక్షణ కేంద్రాల్లో ఉండే జంతువులకు ఇప్పటికే ప్రాథమిక శిక్షణ మరియు వైద్య పరీక్షలు నిర్వహించి ఉంటారు. కాబట్టి వాటిని మచ్చిక చేసుకోవడం చాలా సులభం. మనకు నచ్చిన మరియు మన జీవనశైలికి సరిపోయే జంతువును ఎంచుకునే అవకాశం అక్కడ ఉంటుంది. చిన్న కుక్కపిల్లలు కావచ్చు, పెద్ద వయసున్న జంతువులు కావచ్చు, ఏవైనా సరే మన ప్రేమ కోసం ఎదురుచూస్తుంటాయి.

సమాజంలోని స్వచ్ఛంద సంస్థలు ఈ విషయంలో విశేష కృషి చేస్తున్నాయి. అనాథ జంతువులను రక్షించి, వాటికి తగిన వైద్యం అందించి, సురక్షితమైన ఇళ్లకు చేర్చడం వారి ప్రధాన ఉద్దేశ్యం. ఇటువంటి సంస్థలకు మనం విరాళాల రూపంలోనో లేదా స్వచ్ఛంద సేవ ద్వారానే మద్దతు ఇవ్వవచ్చు. జంతు సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో మార్పు వస్తుంది. వీధుల్లో ఉన్న కుక్కలు లేదా పిల్లులను హింసించకుండా, వాటికి కనీసం తాగడానికి నీరు, తినడానికి ఆహారం అందించే గుణాన్ని పెంపొందించుకోవాలి. పర్యావరణ సమతుల్యతలో ప్రతి జీవికి ఒక పాత్ర ఉంటుంది. జంతువులను ప్రేమించడం అనేది ప్రకృతిని ప్రేమించడంతో సమానం. నగరాల్లో పెరుగుతున్న జనాభా కారణంగా జంతువుల ఆవాసాలు తగ్గిపోతున్నాయి. దీనివల్ల అవి అనాథలుగా మారుతున్నాయి. మనం స్పందించి వాటిని ఆదుకోవడం వల్ల జీవవైవిధ్యం కాపాడబడుతుంది. మూగజీవాల పట్ల క్రూరత్వాన్ని వీడాలి. చట్టపరంగా కూడా జంతువులను హింసించడం నేరం. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ విషయంలో చొరవ చూపడం అవసరం.

దత్తత తీసుకోవడానికి ముందు కొన్ని విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇంటి వాతావరణం జంతువులకు అనుకూలంగా ఉండాలి. వాటికి అవసరమైన సమయాన్ని కేటాయించగలగాలి. పెంపుడు జంతువులను కేవలం సరదా కోసం తెచ్చుకోకుండా, జీవితాంతం తోడుగా ఉంచుకోవాలనే సంకల్పం ఉండాలి. పశువైద్యుల సలహాలు తీసుకుంటూ వాటిని ఆరోగ్యంగా ఉంచాలి. సరిగ్గా పెంచినట్లయితే, అవి మన కుటుంబంలో ఒక అంతర్భాగంగా మారిపోతాయి. మన ఒంటరితనాన్ని పారద్రోలి సరికొత్త శక్తిని ఇస్తాయి. ఈ దినోత్సవం మనకు ఒక గొప్ప అవకాశాన్ని ఇస్తోంది. మూగజీవాలకు నీడను ఇచ్చేందుకు మన వంతు ప్రయత్నం చేద్దాం. ఆశ్రయం లేని ఒక ప్రాణికి గూడు కల్పించడం వల్ల కలిగే ఆనందం మరువలేనిది. మన చుట్టూ ఉన్న వారు కూడా జంతువుల పట్ల కనికరాన్ని ప్రదర్శించేలా ప్రోత్సహిద్దాం. ప్రేమకు భాష అవసరం లేదని, మూగజీవాల కళ్లలో కనిపించే కృతజ్ఞత మనకు అర్థం చేయిస్తుంది. మానవత్వం వెల్లివిరిసేలా, జంతువులకు రక్షణ కవచంలా నిలబడదాం. ప్రతి ప్రాణికి గౌరవప్రదమైన జీవితాన్ని అందిద్దాం.

# ఓటీటీలోకి ‘డెకాయిట్’..

టాలీవుడ్ యువ హీరో అడివి శేష్, హీరోయిన్ మృణాల్ ఠాకూర్ కలిసి నటించిన యాక్షన్ ప్రేమకథ డెకాయిట్ ఇప్పుడు డిజిటల్ వేదికపైకి రానుంది. ఈ చిత్ర విజయానికి ప్రధాన కారణంగా అడివి శేష్ సహజ నటన, మృణాల్ ఠాకూర్ భావోద్వేగభరితమైన అభినయం నిలిచాయి. అలాగే సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం కథకు మరింత బలం చేకూర్చింది. ప్రముఖ డిజిటల్ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్ర స్ట్రీమింగ్ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. తాజా సమాచారం ప్రకారం మే 8 నుంచి దేశవ్యాప్తంగా పలు భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉన్నప్పటికీ, డిజిటల్ విడుదల దాదాపు ఖరారైనట్టే తెలుస్తోంది.




# ‘టాక్సిక్’ మళ్లీ వాయిదా..

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా, ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న హైవోల్టేజ్ యాక్షన్ చిత్రం ‘టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్’ మరోసారి వాయిదా పడింది. ‘కేజీఎఫ్’ సిరీస్‌తో అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్న యష్ ఈ సినిమాను భారీ స్థాయిలో రూపొందిస్తుండగా, విడుదల తేదీపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మొదట ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయాలని ప్లాన్ చేసిన మేకర్స్, తర్వాత జూన్ 4కి వాయిదా వేశారు. అయితే ఇప్పుడు ఆ తేదీకి కూడా సినిమా విడుదల కావడం లేదని యష్ స్వయంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగపూరిత ప్రకటన విడుదల చేశారు. సినిమాకు కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ వేదికపై వచ్చిన అంతర్జాతీయ స్పందనతో తమ బాధ్యత మరింత పెరిగిందని యష్ తెలిపారు. భారతీయ సినిమాను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టేలా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. షూటింగ్ పూర్తయినప్పటికీ, ప్రస్తుతం గ్లోబల్ డిస్ట్రిబ్యూషన్, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై పని జరుగుతోందని వెల్లడించారు. త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ చిత్రానికి ఓటీటీ హక్కులపై చర్చలు కొనసాగుతున్నాయి. ఒక ప్రముఖ సంస్థ రూ.110 కోట్లు ఆఫర్ చేయగా, నిర్మాతలు మాత్రం కనీసం రూ.250 కోట్లు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందం ఇంకా ఖరారు కాకపోవడం కూడా ఆలస్యానికి కారణమైందని సమాచారం. అలాగే ప్యాచ్ వర్క్ పనులు పూర్తికాకపోవడం, సెన్సార్ ప్రక్రియ ప్రారంభం కాకపోవడం వంటి అంశాలు కూడా వాయిదాకు దారితీశాయి.



## వేదికపై భావోద్వేగానికి లోనైన

# పాయల్ రాజ్‌పుత్

ఆర్‌ఎక్స్ 100 సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ తాజాగా ఓ సినిమా కార్యక్రమంలో భావోద్వేగానికి లోనయ్యారు. తన వ్యక్తిగత జీవితంలోని విషాదాన్ని తలుచుకుని వేదికపైనే కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారిని కలిచివేసింది. ఫస్ట్ టైమ్ 01-01-01 సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ చిత్రానికి హేమంత్ ఇప్పలపల్లి దర్శకత్వం వహించగా, పాయల్ చిన్ననాటి స్నేహితుడు సౌరభ్ ధింగ్రా హీరోగా నటిస్తున్నాడు. స్నేహితుడిని ప్రోత్సహించేందుకు ముఖ్య అతిథిగా హాజరైన పాయల్, సినిమా విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే కార్యక్రమం ముగింపు సమయంలో ఒక విలేకరి అడిగిన ప్రశ్న ఆమెను తీవ్రంగా కలచివేసింది. గతంలో విపాసన ధ్యానం కోసం వెళ్లిన విషయాన్ని ప్రస్తావించగా, పాయల్ తన తండ్రి విమల్ కుమార్ రాజ్‌పుత్‌ను గుర్తు చేసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. “మా నాన్నే నా జీవితానికి హీరో. నేను చేసిన ప్రతి సినిమాను ఆయనే ముందుగా చూసి తన అభిప్రాయం చెప్పేవారు. ఇటీవల వచ్చిన నా పంజాబీ సినిమా చూడాలని ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. కానీ ఇప్పుడు ఆయన మన మధ్య లేరు” అంటూ భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆర్‌ఎక్స్ 100 వంటి బోల్డ్ చిత్రంలో నటించినప్పటికీ తన నటనను తండ్రి ప్రశంసించారని ఆమె గుర్తుచేసుకున్నారు. ఈ క్రమంలో భావోద్వేగాన్ని అదుపు చేసుకోలేక వేదికపై నుంచి వెళ్లిపోయారు. చిత్ర బృందం ఆమెను ఓదార్చేందుకు ప్రయత్నించినప్పటికీ, ఆ క్షణం అందరినీ కదిలించింది.

పాయల్ తండ్రి విమల్ కుమార్ రాజ్‌పుత్ గత ఏడాది జూలై 28న కన్నుమూశారు. అన్నవాహిక క్యాన్సర్‌తో పోరాడుతూ 67 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. ఆయన అనారోగ్య సమయంలో కుటుంబం ఎదుర్కొన్న కష్టాలు, మానసిక ఒత్తిడి గురించి పాయల్ గతంలో కూడా వెల్లడించారు. ఆ బాధ నుంచి బయటపడేందుకు ఆమె విపాసన ధ్యానాన్ని ఆశ్రయించారని, జీవితంలోని విషాదాన్ని అంగీకరించి ముందుకు సాగేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

ఆమంచ గీతికా శ్రీ
536/600



పెసరు జాహ్నవి
522/600



# ఎస్సెస్సీ ఫలితాల్లో తాటికాయల జెడ్పిహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ

## మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఆమంచ గీతిక, పెసరు జాహ్నవి

**ధర్మసాగర్,ఏప్రిల్29(తెలంగాణ ముచ్చట్లు):**

తాటికాయల జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులు ఎస్సెస్సీ ఫలితాల్లో మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటుతూ పాఠశాలకు గౌరవాన్ని తీసుకువచ్చారు. ఆమంచ గీతిక శ్రీ 600 మార్కులకు గాను 536 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా, పెసరు జాహ్నవి 522 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. విద్యార్థుల విజయంపై ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా మేరీతో పాటు ఉపాధ్యాయులు డి నవీన్ కుమార్, శ్రీనివాస్, బి రాజు, టి వసుంధర సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన బోధనతో పాటు విద్యార్థుల కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్ర ప్రధానోపాధ్యురాలు ఫాతిమా మేరీ ఆకాంక్షించారు.

తాటికాయల జెడ్పిహెచ్ఎస్ లో మొత్తం 26 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 25 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 15 మంది, బాలికలు 11 మంది పరీక్షలు రాశారు. ఒక విద్యార్థి హిందీ పరీక్షకు గైర్హాజరై ఫెయిల్ అయ్యారు. పాఠశాల ఉత్తీర్ణత శాతం 96.1గా నమోదైంది.

మార్కుల వారీగా చూస్తే 500కు పైగా మార్కులు సాధించిన వారు 2 మంది ఉన్నారు. 450 నుంచి 500 మధ్య 7 మంది, 360 నుంచి 449 మధ్య 15 మంది విద్యార్థులు ఉన్నారు. 359 కంటే తక్కువ మార్కులు సాధించిన వారు ఒక్కరే ఉన్నారు. ఈ ఫలితాలు పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

### విద్యార్థులకు,ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపిన సర్పంచ్

**మండల స్థాయిలో ప్రథమ,ద్వితీయ స్థానాల్లో ర్యాంక్ సాధించిన తాటికాయల(ప్రభుత్వ పాఠశాల)జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులను స్థానిక సర్పంచ్ ననుబాల సోమక్క చంద్రమౌళి,ఉపసర్పంచ్ పెసరు శివ,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు పలువురు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు.**




## ఎస్సెస్సీ ఫలితాల్లో మెరిసిన సెయింట్ ఆంథోనీ పాఠశాల విద్యార్థిని ఎడ్ల పవిత్ర

**ధర్మసాగర్,ఏప్రిల్29(తెలంగాణ ముచ్చట్లు):**

తాటికాయల గ్రామానికి చెందిన ఎడ్ల అనిత బుగులయ్యల కుమార్తె ఎడ్ల పవిత్ర ఎస్సెస్సి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ధర్మసాగర్ మండలం కరుణాపురంలోని సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఆమె 600 మార్కులకు గాను 516 మార్కులు సాధించి ప్రతిభ చాటింది.పవిత్ర సాధించిన ఈ ఫలితం ఆమె కృషి, పట్టుదలతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వానికి నిదర్శనంగా నిలిచింది. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఆమెను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ కుమార్తె సాధించిన ఫలితంపై ఆనందం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో చదువుకోవడం, ఉపాధ్యాయుల సూచనలు పాటించడం వల్లే ఈ విజయాన్ని సాధించిందని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా మెరుగైన విజయాలు సాధించాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు.

### పవిత్రకు అభినందనలు తెలిపిన వార్డు సభ్యులు

కాలనీలో ఎస్సెస్సి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఎడ్ల పవిత్రకు స్థానిక వార్డు సభ్యులు బొల్లెపాక అనిత సంపత్,పట్ల రమేష్,ఎర్ర సంపత్,పట్ల యాదమ్మ రాంచందర్ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్ లోను పవిత్ర ఉన్నత విద్యలో రాణించాలని, మెరుగైన విజయాలు సాధించాలని ఆకాక్షించారు.



## ఎస్సెస్సీ ఫలితాల్లో మెరిసిన

# ఏకశిల విద్యార్థులు

**హన్మకొండ,ఏప్రిల్29(తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లాలో పదవ తరగతి ఫలితాల్లో ఏకశిల విద్యాసంస్థల విద్యార్థులు మరోసారి విశేష ప్రతిభ చాటారు. ఈ ఏడాది సీబీఎస్ఈ మరియు రాష్ట్ర పాఠ్యాంశ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధిస్తూ సంస్థ విజయపథాన్ని కొనసాగించింది. 585, 582, 580, 578, 577, 576, 574, 573, 572, 571, 570 మార్కులు సాధించిన విద్యార్థులు తమ ప్రతిభ, కృషి, పట్టుదలను స్పష్టంగా నిరూపించారు.

పెంబర్తి, హసన్పర్తిలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ డా. గౌరు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, విద్య అంటే కేవలం మార్కులు మాత్రమే కాదని, భవిష్యత్తును నిర్మించే శక్తి అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉందని, ఆ ప్రతిభను వెలికి తీసి విజయంగా మలచడం సంస్థ లక్ష్యమని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, జీవిత నైపుణ్యాలను పెంపొందించే దిశగా కృషి చేస్తున్నామని వివరించారు. విద్యార్థులను కేవలం పరీక్షల కోసం మాత్రమే కాకుండా, భవిష్యత్ జీవితానికి సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విజయంతో సంస్థకు గౌరవం, గుర్తింపు మరింత పెరిగిందని, తమపై విశ్వాసం ఉంచిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ పిల్లల భవిష్యత్తుకు ఉత్తమ విద్య కోరుకునే తల్లిదండ్రులు ఈ విజయయాత్రలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు బేతి కొండల్ రెడ్డి, సువిజా రెడ్డి, ప్రిన్సిపాళ్లు బేతి శైలజ రెడ్డి, ముచ్చ స్వప్న రెడ్డి, ఎండీ బాబా, కే డి స్వర్ణ రాజ్, లవకుమార్, అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జి జి రామ్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# క్రెడిట్ కార్డు బిల్లులకు మూడు రోజుల గడువు




క్రెడిట్ కార్డులు వినియోగించే వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ఊరట కలిగించింది. క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపులో ఆలస్యమైతే వెంటనే జరిమానాలు విధించకుండా మూడు రోజుల గ్రేస్ పీరియడ్ ఇవ్వాలని కొత్త నిబంధనలు జారీ చేసింది.

ఈ నిర్ణయం ప్రకారం, బిల్లు గడువు తేదీ ముగిసిన తర్వాత కూడా మూడు రోజుల వరకు వినియోగదారులకు అదనపు సమయం లభిస్తుంది. ఈ సమయంలో ఎలాంటి ఆలస్యపు రుసుములు లేదా ఇతర ఛార్జీలు విధించరాదు. మూడు రోజుల తర్వాత మాత్రమే ఆలస్యంగా చెల్లించినట్లుగా పరిగణించి జరిమానాలు విధించాల్సి ఉంటుంది.

అంతేకాకుండా, లేట్ ఫీజులను లెక్కించే విధానంలో కూడా మార్పులు తీసుకొచ్చింది. గడువు దాటిన మొత్తం బకాయిపై మాత్రమే ఛార్జీలు విధించాలి గానీ, మొత్తం బిల్లు మొత్తంపై కాదు. దీనివల్ల వినియోగదారులపై పడే ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంది. ఇప్పటివరకు అనేక బ్యాంకులు గడువు తేదీ ముగిసిన వెంటనే లేట్ ఫీజులు విధించేవి. దీనివల్ల వినియోగదారులు అదనపు భారాన్ని భరించాల్సి వచ్చేది. కొత్త నిబంధనలతో ఈ సమస్యకు కొంతవరకు పరిష్కారం లభించనుంది.

ఈ మార్పులు వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటం, చెల్లింపుల విధానంలో పారదర్శకత తీసుకురావడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్బీఐ పేర్కొంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in